సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు

నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

మెహిదీపట్నం ఏప్రిల్ 8 : ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడే నిజమైన ప్రజాప్రతినిధి అని, సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలలో తన గెలుపును ఎవరూ అడ్డుకోలేరని బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఈ సారి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీదే గెలుపు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ సమావేశం మెహిదీపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకోసం అహర్నిశలు తాపత్రయపడే మాజీ సీఎం కేసీఆర్ తనకు ఆదర్శమని, ఆయన టికెట్ ఇస్తూనే తన గెలుపు ఖాయమని ఆశీర్వదించారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం కోసం కృషి చేయాలన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి సొంత కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండని వ్యక్తి అని, పార్లమెంట్ సెషన్ లేనప్పుడు తన నియోజకవర్గం గల్లీలో తిరగాల్సిన మంత్రి, కేవలం ఎన్నికలప్పుడే ప్రజల కోసం వస్తారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఏ ఎన్నికల్లో ఏ పార్టీలో ఉంటాడో ఎవరికీ తెలియదని, ప్రజల్లో ఆయనకు పూర్తి వ్యతిరేకత ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో తాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడుతున్నానని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే తన ఆయుధం అని పేర్కొన్నారు. మాజీ హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ మాట్లాడుతూ.. కష్టపడేతత్వం ఉన్న పద్మారావుగౌడ్‌ను గెలిపించి ఢిల్లీకి పంపాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎస్. ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు

రంజాన్ రోజున నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్‌శాఖల అధికారులు ఏర్పాట్లు చేపట్టాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. మెహిదీపట్నం,అహ్మద్‌నగర్, విజయ్‌నగర్ కాలనీ, మల్లేపల్లి డివిజన్లలోని ఈద్గా మైదానాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. - మెహిదీపట్నం, ఏప్రిల్ 8

ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన బొట్టు రామ్, తూముకుంట అరుణ్‌కుమార్ కార్వాన్ కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని నియోజకవర్గం ఇన్‌చార్జి ఉస్మాన్ అలీని కలిసి సన్మానించారు. - అబిడ్స్

పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 8 : పండుగలను మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఈస్ట్‌జోన్ సుల్తాన్‌బజార్ డివిజన్ ఆధ్వర్యంలో శ్రీ రామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని సుల్తాన్‌బజార్, అఫ్జల్‌గంజ్, నారాయణ గూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మైత్రి, పీస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశాన్ని జాంబాగ్‌లోని వివేక వర్ధిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎవరైనా ప్రశాంత వాతావరణానికి ఆటంకం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ కె శంకర్, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్, నారాయణగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఎస్ఐలు కిరణ్‌కుమార్ రెడ్డి, మధుసూదన్, శ్వేత, నరేష్, రషీద్, పీస్ కమిటీ సభ్యులు డాక్టర్ అహ్మద్, మహ్మద్ ఇషాక్, ప్రదీప్ జైస్వాల్, ఎంఏ రహమాన్, సుమిత్ రాఠి పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

ఉపకులాలు, మాదిగలు, మాలలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలక మండలి నియామకంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఎస్సీ 57 ఉపకులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. - కవాడిగూడ, ఏప్రిల్ 8

పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా శ్రీశైలంయాదవ్

జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ చిన్న శ్రీశైలంయాదవ్‌ను ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన బీసీ, బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర చైర్మన్‌గా శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. 11న పూలే జయంతి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కులచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, కనకాల ఫాంకూర్మ, సదానంద్, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణగౌడ్, మహేశ్ మేరు పాల్గొన్నారు. - రవీంద్రభారతి, ఏప్రిల్ 8

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ మోతి దర్వాజలో ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకుడు గులాం మొహినుద్దీన్ పాషా, షకీల్ అలీఖాన్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఐఎం చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, నాయకుడు నూరుద్దీన్ ఒవైసీ, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్ అతిథులుగా విచ్చేసి ఉపవాస దీక్షను విరమించారు. - మెహిదీపట్నం, ఏప్రిల్ 8

సుందర్‌నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్

21 ద్విచక్రవాహనాలు, ఆటో స్వాధీనం

కాచిగూడ, ఏప్రిల్ 8: కాచిగూడ పీఎస్ పరిధిలోని సుందర్‌నగర్, సుందర్‌నగర్-ఏ బస్తీలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రొగ్రామ్‌ను సోమవారం రాత్రి నిర్వహించారు. కాచిగూడ ఏసీపీ వి.రఘు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సుందర్‌నగర్ బస్తీకి వచ్చేదారులన్నింటినీ మూసివేసి 110 మంది పోలీసులు ఇంటింటికీ వెళ్లి ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల గుర్తింపు కార్డులను, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీలలో పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో చట్ట వ్యతిరేక కార్యక్రమాలను అదుపు చేయడమే గాక పోలీసులపట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు. ఎస్సైలు డి.సుభాష్, పి.రవికుమార్, హెచ్. నరేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రొగ్రామ్‌లో పాల్గొన్న ఏసీపీ ఆకుల వి.రఘు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది

గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు సునీల్ సాహూ పాల్గొన్నారు. - అబిడ్స్, ఏప్రిల్ 8

అమావాస్యను పురస్కరించుకొని భజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కోఠి లోని నల్ల పోచమ్మ ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు విట్టల్, కార్యదర్శి రవి, భజరంగ్ సేన ప్రధాన కార్యదర్శి సూర్య శుక్ల, నగర అధ్యక్షుడు మనోజ్ పాల్గొన్నారు. - సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 8

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా అన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దాత ప్రొద్దుటూరి నర్సింహారావు, సహదాత వెంకటసుబ్బయ్య సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలను రమేశ్ గుప్తా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అడిషనల్ సెక్రటరీ అమర మాలకుమార్, కోశాధికారి చిట్టిమల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.- చిక్కడపల్లి, ఏప్రిల్ 8

లీజులు రద్దు చేయాలి

కరువుతో చెరువులు, కుంటలు ఎండిపోయి మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ మత్స్యకారుల, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. కరువుతో ఎండిపోయిన చెరువులు, కుంటల జలవనరులకు లీజులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు నరసింహ, సీహెచ్ వెంకన్న, మామిళ్ల జగదీశ్ పాల్గొన్నారు. - చిక్కడపల్లి, ఏప్రిల్ 8

విద్యార్థులు ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ వెంకటేశం అన్నారు. సోమవారం గాంధీనగర్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్స్‌లో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్స్, మార్షల్‌ఆర్ట్స్, మార్షల్ జైన్ సెక్రెటరీ మాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో గ్రీన్ బెల్ట్, బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్స్ అందజేశారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, ఎగ్జామినర్ సంజయ్ సింగ్ కోచ్‌లు కార్తిక్, మనీశ్, రఘు, స్వామి, సిద్దు, హరిణి, వెంకట్, భాస్కర్ పాల్గొన్నారు. - కవాడిగూడ, ఏప్రిల్ 8

వ్యక్తికి రిమాండ్

కాచిగూడ, ఏప్రిల్ 8 : డబ్బులు దొంగిలించిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..2వ తేదీ ఉదయం దిలీప్‌కుమార్ కాచిగూడ రైల్వేస్టేషన్ ముందు నుంచి నడుచుకుంటూ రైల్వే విధులకు వెళ్తున్నాడు. రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ అలియాస్ లచ్చి అదే అదునుగా దిలీప్‌కుమార్ జేబులోంచి రూ.28 వేలు లాక్కొని పారిపోయాడు. దిలీప్‌కుమార్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.రవికుమార్ తెలిపారు.

బాలుడు అదృశ్యం

అబిడ్స్, ఏప్రిల్ 8 : బాలుడు ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయిన ఘటన మంగళ్‌హాట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ కథనం ప్రకారం.. ఇందిరానగర్‌లో రేణుక ఆమె ఇద్దరు కుమారులతో పాటు తండ్రితో కలిసి ఉంటున్నది. 6న రేణుక తమ గ్రామానికి వెళ్లగా పెద్ద కుమారుడు ఎన్.వినోద్, తండ్రి పనికి వెళ్లారు. చిన్నబ్బాయి 14 ఏండ్ల ఎన్.సాయిపవన్ ఇంటి వద్ద ఉన్నాడు. కాగా ఆరో తేదీ రాత్రి పది గంటలకు తాత ఇంటికి వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. ఆరా తీయగా అదే రోజు సాయంత్రం 35 ఏండ్ల వయసున్న వ్యక్తి వచ్చి వెళ్లిన తర్వాత సాయి పవన్ కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. దీంతో అతని సోదరుడు వినోద్ మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడు ఇంటి నుంచి వెళ్లే సమయంలో టీ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలుగు, హిందీ, కన్నడ, మరాఠి, ఇంగ్లిష్ భాషలు వస్తాయని, ఆచూకీ తెలిసిన వారు మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ అస్లం కోరారు.

పిలల్లకు మాతృభాషపై పట్టు కలిగించాలి

మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు

సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్న వెంకయ్యనాయుడు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 8 : పిల్లలకు మాతృభాషపై పట్టు కలిగించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జస్టిస్ ఆవుల సాంబశివ రావు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరాయి భాషల వ్యామోహంలో పడి యువత మాతృభాషను విస్మరించరాదని సూచించారు. చరిత్రను, భాషను రక్షించిన వారికి పురస్కారాలు అందించడం సముచితమన్నారు. తెలుగువర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు ఆవుల మంజులత పాల్గొని మాట్లాడారు. చరిత్ర పరిశోధకులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణకు -2023, మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మన్నం వెంకటరాయుడుకు - 2024కుగాను పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ. 25వేల నగదు, సన్మాన పత్రం, జ్ఞాపికను ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య టి. కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, మండలి వెంకటరామకృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య రెడ్డి శ్యామల, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

యూపీఎస్‌సీ ప్రిపరేషన్‌పై వర్క్‌షాప్

యూపీఎస్‌సీ ప్రిపరేషన్‌పై నారాయణ ఐఏఎస్ వర్క్‌షాప్ సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. సదస్సులో ఏపీ రిటైర్డ్ సీఎస్ మోహన్ కందా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని సివిల్ సర్వీసెస్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అభ్యర్థులు పాల్గొన్నారు. - రవీంద్రభారతి

కోయభాషకు అకాడమీ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న చిలుకూరి అమర వరప్రసాద్

రవీంద్రభారతి, ఏప్రిల్ 8 : కోయభాషకు అకాడమీ ఏర్పాటు చేయాలని కోయ భాష మూలకర్త చిలుకూరి అమర వరప్రసాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిలుకూరి అమర వరప్రసాద్ మాట్లాడుతూ.. కోయ సామాజిక వర్గాన్ని గత 40 ఏళ్లుగా అధ్యయనం చేసి కోయ భాష లిపిని రూపొందించడం జరిగిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 7 దశాబ్దాలు గడిచిన కోయ భాష వాడుకలో ఉన్నప్పటికీ నేటి వరకు లిపి లేకపోవడం విచారకరమన్నారు. కోయభాషను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి కోయ భాషకు అకాడమీని ఏర్పాటు చేసి, 1వ తరగతి నుంచి5వరకు పాఠ్యపుస్తకాలను ముంద్రించాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన జరగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బషీర్‌బాగ్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ గుమ్మడి అనూరాధ, రేగా రాజేందర్, రామలింగయ్య, వెంకటరమణ, శంకర్‌రావు, పద్మజ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విజయ సాధనలో నెట్‌వర్కింగ్ పాత్ర కీలకం

విజయాన్ని సాధించడంలో నెట్ వర్కింగ్ పాత్ర కీలకమని ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ కమిషనర్ బాలకృష్ణ, ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజయ్‌కుమార్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీసులాల్ జైన్, సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్, వేణుగోపాల్ సామల, పర్వతారోహకురాలు జాహ్నవి పాల్గొన్నారు. -అబిడ్స్, ఏప్రిల్ 8

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ కూల్చివేత

ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని సర్వే నం.70లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని సోమవారం ఆసిఫ్‌నగర్ తాసీల్దార్ ఎస్. జ్యోతి నేతృత్వంలో సిబ్బంది కూల్చివేశారు. వార్డు 19లో బ్లాక్ ఎఫ్‌లో టీఎస్ నం. 25లో ఉన్న ప్రభుత్వ భూమికి ఆదివారం కొందరు అక్రమార్కులు ప్రహరీ నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో స్పందించిన తాసీల్దార్ సోమవారం కూల్చివేతలు చేపట్టి ప్రహరీని తొలగించారు. - మెహిదీపట్నం, ఏప్రిల్ 8

ఇతరుల రచనలు అధ్యయనం చేయాలి

స్వాతి శ్రీపాదను సత్కరిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 8 : సాహిత్యరంగంలో రాణించాలంటే ఇతరుల రచనలు అధ్యయనం చేయాలని రచయిత్రి స్వాతి శ్రీపాద సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నేను నా రచనలు ' అంశంపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వాతి శ్రీపాద ప్రసంగిస్తూ.. అధ్యాపక వృత్తిని కొనసాగిస్తూనే కథ, నవల, అనువాద ప్రక్రియల్లో రచనలు సాగించినట్లు వివరించారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ.. చక్కని అనువాదాలను సాహిత్య లోకానికి అందించారని ప్రశంసించారు. తెలుగు జానపద సాహిత్య పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ సి.వసుంధర, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ఏ సిల్మానాయక్ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

పరిశుభ్ర వాతావరణంలో వైద్యసేవలు అందించాలని గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. సోమవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బందితో ఆయన ఆస్పత్రిలో స్వచ్ఛతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్లు శ్రీనివాస్, అఫ్సన్, గోపాల్, క్రాంతి కిరణ్, వాణి తదితర సిబ్బంది పాల్గొన్నారు. - మెహిదీపట్నం, ఏప్రిల్ 8

అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ పర్యటించారు. అక్కడ పారిశుధ్య పనులను పరిశీలించారు. రహదారులపై చెత్త వ్యర్థాలను శుభ్రం చేయాలని సూచించారు. - గోల్నాక, ఏప్రిల్